## డబ్ల్యుటివో నైరోబి సదస్సు

# సామ్రాజ్యవాదులు పుట్టించి, చంపిన అబద్ధం 'దోహా అభివృద్ధి అజెండా'

**ప్రపంచ** వాణిజ్య సంస్థ మంత్రులస్థాయి 10వ సదస్సు కెన్యా రాజధాని నైరోబిలో జరిగింది. ఇది కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు చేసింది. అవి సామ్రాజ్యవాద దేశాలకు అనుకూలంగానూ, వెనుక బడిన దేశాలకు వినాశకర నష్టాన్ని కలిగించేవిగానూ వున్నాయి. నైరోబి సదస్సు అంతిమ ప్రకటన సారాంశం దోహాలో 14 ఏళ్ళుగా జరుగుతున్న మంత్రులస్థాయి వాణిజ్య చర్చల 'దోహా అభివృద్ధి అజెండా'ను చంపి వేయటమే. వెనుకబడిన దేశాలకు ఆశలు గొలిపే ఎరగా వాడుకునేందుకు ఆ శవాన్నింకా పూడ్చిపెట్టలేదు.

దోహా అభివృద్ధి అజెండాను వదలి వేయటం యొక్క ప్రాముఖ్యత అర్థంకావాలంటే దాని చరిత్రను స్థూలంగా తెలుసుకోవాలి. 1948లో జనరల్ అగ్రిమెంట్ అన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్ (గాట్) ఏర్పాటైంది. 1930ల నాటి అనుభవం పునరావృతం కాకుండా నివారించే ఏకైక లక్ష్యంతో ఇది ఏర్పాటైంది. ఆనాడు సామ్రాజ్యవాద శక్తులు రెండు శిబిరాలుగా ప్రపంచ మార్కెట్టులో వాటా కొరకు తీవ్రంగా పోటీ పడ్డాయి. ఫలితంగా మహా మాంద్యత వచ్చి, తర్వాత వచ్చిన రెండవ ప్రపంచ యుద్ధానికి కావలసిన పరిస్థితులను సృష్టించింది.

వాణిజ్యంలో దేశాలు యిచ్చే రాయితీ బహుపక్ష స్వభావం కలిగి వుండాలన్న, ఏ దేశం తీసుకున్న నిర్ణయాలైనా ఆ దేశానికీ లేదా ఆ దేశ బృందానికీ మాత్రమే పరిమితం కారాదన్న, అన్ని దేశాలకూ సమానంగా వర్తించాలన్న సూత్రం ప్రాతిపదికగా గాట్ ఏర్పడింది.

గాట్ వెనుకనున్న ప్రధానశక్తి అమెరికా సామ్రాజ్యవాదం. దీనికోసం అది ప్రవచించిన "స్వేచ్ఛా వాణిజ్యం"లో నిజాయితీ లేదు. 1930ల నాటి మహా మాంద్యం నుండి తాను తీసుకున్న అనుభవాల నుండి స్వేచ్ఛా వాణిజ్య నినాదం తీసుకుంది. ఆనాటి స్థితి పునరావృతం కాకుండా వుండాలంటే ప్రపంచ దేశాలన్నీ అమెరికా వాణిజ్యానికి ఆటంకాలు లేనివిధంగా గేట్లు తెరిచిపెట్టాలన్నది దాని గుణపాఠం. 19వ శతాబ్దంలో అతిపెద్ద వలసాధిపతిగా వున్న బ్రిటీషు సామ్రాజ్యవాదం కూడా ఆనాడు తన ఆర్థిక ఆధిపత్యం కాపాడు కోవటానికి స్వేచ్ఛా వాణిజ్య నినాదమిచ్చింది. అలాగే అమెరికా సామ్రాజ్యవాదం కూడా తన ఆర్థిక ఆధిపత్య స్థాయి నుండే స్వేచ్ఛా వాణిజ్య నినాదాన్ని చేపట్టింది.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత సామ్రాజ్యవాద విస్తరణకు అవసరమైన పరిస్థితుల కల్పనకు ఏర్పాటుచేసిన అంతర్జాతీయ ఆర్థిక చట్రంలో భాగమే గాట్ (ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్‌లు కూడా దీనిలో భాగమే). అయితే దీనిలో వైరుధ్యాలున్నాయి. దీనివల్ల ప్రపంచ మార్కెట్టు పెరిగింది. ఈ పెరుగుదల అమెరికా సామ్రాజ్యవాదానికి అవసరం. అప్పుడే దాని దోపిడీ పెరుగుతుంది. అయితే ఈ పెరుగుదల ఇతర సామ్రాజ్యవాదులు తిరిగి కోలుకునేట్లు కూడా చేసింది. అవి ప్రపంచ మార్కెట్టులో వాటా కొరకు పోటీపడి అమెరికా సామ్రాజ్యవాదపు ఆర్థిక ప్రాభవాన్ని క్రమంగా తగ్గిస్తున్నాయి. ఈ వైరుధ్యం తీవ్రత 1971లో మొదటిసారి బయటపడింది. అమెరికా డాలరుకు దన్నుగా బంగారు నిల్వలుంచటమన్న సూత్రాన్ని అమెరికా వదలివేసింది. ఇది 1944లో జరిగిన బెట్టన్‌వుడ్స్ ఒప్పందానికి వ్యతిరేకం.

అయినా ఈ వైరుధ్యం తీవ్రమౌతూ రావటం, "కోల్డ్‌వార్" ముగియటం, అదే సమయంలో ఫ్రాన్సు, బ్రిటన్‌ల నాయకత్వంలో యూరోపియన్ యూనియన్ ఏర్పడటంతో, అమెరికా సామ్రాజ్యవాదం మళ్ళీ స్వేచ్ఛా వాణిజ్య నినాదంతో ప్రపంచ వాణిజ్యాన్ని నియంత్రించే అంతర్జాతీయ సంస్థ అవసరమని వాదించింది. 1995లో సామ్రాజ్యవాదులందరూ కలిసి గాట్ స్థానంలో ప్రపంచ వాణిజ్య సంస్థను ఏర్పాటు చేశారు. బహుపక్ష వాణిజ్యం పేరిట, సరుకుల వాణిజ్యంతో పాటు, సేవలు, పెట్టుబడులు మేథోపర హక్కులు తదితరాలన్నింటినీ వాణిజ్యంలోకి చేర్చి మూడవ ప్రపంచ దేశాలపై దోపిడీ ఆధిపత్యాలను పెంచుకున్నారు.

ప్రపంచ వాణిజ్యసంస్థ ఏర్పాటుతో ప్రపంచ మార్కెట్టు పెరిగింది. గాట్‌లో లాగే సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యమూ పెరిగింది. ఇది అమెరికా ఆర్థిక ఆధిపత్యానికి తూట్లు పొడుస్తున్నది. బహుపక్ష వాణిజ్యమన్న సూత్రాన్ని వదిలివేయటాన్ని అమెరికా ప్రారంభించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటు సందర్భంలో చేసిన వాగ్దానాలకు భిన్నంగా ద్వైపక్ష వాణిజ్య ఒప్పందాలను చేసుకొంటున్నది.

దీనిలో భాగంగానే పసిఫిక్ మహాసముద్ర తీర దేశాల భాగస్వామ్య (టిపిపి) ఒప్పందం చేసుకుంది. దీనిలో 12 దేశాలున్నాయి. బహుపక్ష వాణిజ్యమన్న సూత్రాన్ని ప్రక్కనపెట్టి, ఈ ఒప్పందంలోని దేశాలకు మాత్రమే అమెరికా మార్కెట్టులో ప్రవేశించే అవకాశాలను పెంచింది. దీనికి ప్రతిగా సభ్యదేశాలు తమ వాణిజ్య చట్టాలను అమెరికా చట్టాలకు నకలుగా ఉండేవిధంగా సవరించేందుకు అంగీకరింపచేసింది. ఈ అంశం డబ్ల్యుటివో నిబంధనలకంటే కఠినతరమైనదే కాక ఈ దేశాలపై అమెరికా ఆధిపత్యాన్ని పెంచుతుంది. రెండవది – ప్రతిపాదనలో వున్న ఒప్పందం. ఇది యూరపు, అమెరికాల మధ్య ఆర్థిక సంబంధాలను నిర్వచించేదిగా

వుండి టిపిపి స్వభావాన్నే కలిగి వుంది. అట్లాంటిక్ మహాసముద్రాంతర వాణిజ్య, పెట్టుబడి భాగస్వామ్యం (టిటిఐపి) దీనిపేరు. ప్రపంచ వాణిజ్య సంస్థలో అమెరికా ముఖ్య ప్రతినిధి మైకేల్ ఫ్రోమాన్ మాటలో ఈ రెండు ఒప్పందాల లక్ష్యమేమంటే "విశ్వ మార్కెట్టు మూడింట రెండు వంతులు ఎలాంటి ఆటంకమూ లేకుండా అమెరికాకు అందుబాటులోకి తెచ్చే ఒప్పందాల సాలెగూడులో అమెరికాను కేంద్ర స్థానంలో వుంచటమే".

దీనిని సమర్థించుకుంటూ ఫ్రోమాన్ చేసిన వాదన ఇలా వుంది (ఫైనాన్షియల్ టైమ్స్‌లో ఆయన వ్యాసం నుండి) : "వాణిజ్య విధానాన్ని రూపొందించు కోవటంలో అమెరికా గతంలో ఎరుగని ఇబ్బందుల నెదుర్కొంటున్నది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ఉన్న ఆర్థిక ఆధిపత్య స్థితితో పోల్చితే, నేడు అమెరికాకు ఆ స్థాయి, ఆర్థిక ఆధిపత్యం లేదు. కనుక పరస్పర అంగీకారానికి వచ్చే తీరులో పనిచేయాల్సి వస్తున్నది". యుద్ధం ముగిసిన తర్వాత ఏర్పాటు చేసిన విశ్వ వాణిజ్య వ్యవస్థలో 7 దశాబ్దాలపాటు అమెరికా రాజకీయనేతలే నాయకత్వ పాత్ర వహించారు. ఇది "అమెరికా తీరాలకు ఉద్యోగాలను తెచ్చింది. ప్రపంచ దేశాలకూ శాంతి సౌభాగ్యాలనిచ్చింది" అని వ్రాశాడు. అయితే ఇటీవల సంవత్సరాలలో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో "ఖండాంతర్గత చలనం" ఉనికిలోని వాణిజ్య వ్యవస్థను మార్చాలని తెలుపుతున్నది అన్నాడు. దీనికనుగుణంగానే ఆయన దోహా చర్చలు "ఫలితానివ్వలేదు అనీ, అది విధించిన "సంకెళ్ళ" నుండి ప్రపంచం స్వేచ్ఛ పొందాల్సిన తరుణమాసన్నమైందనీ అన్నాడు. "ద్విపక్ష ఒప్పందాలు పనిచేస్తున్నాయి; ప్రాంతీయ ఒప్పందాలు పనిచేస్తున్నాయి. బహుపక్షతత్వం మాత్రమే స్థంభించిపోయింది" అని వాదించాడు. ఇది అమెరికా సామ్రాజ్యవాద నాయకుల ఆలోచనలను తెలుపుతున్నది.

ఈ నేపథ్యంలోనే నైరోబీ సదస్సు జరిగింది. దోహా అభివృద్ధి అజెండా అన్నది ఒక అబద్ధం. వెనుకబడిన దేశాల వ్యవసాయరంగానికి ఊతమిచ్చేందుకు, అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు తమ వ్యవసాయరంగానికిస్తున్న సబ్సిడీల తగ్గింపు దిశగా దోహాలో వ్యవసాయరంగంపై చర్చలుంటాయన్న వాగ్దానంతో ప్రపంచ వాణిజ్యసంస్థ దోహా చర్చలను వెనుకబడిన దేశాలపై సామ్రాజ్యవాదులు రుద్దారు. ఇంతేకాక దోహా చర్చలు "అభివృద్ధి"పై కేంద్రీకరించి చర్చలు సాగిస్తాయనీ వాగ్దానం చేశారు. అందువల్ల వెనుకబడిన దేశాల ఆర్థికవ్యవస్థలోని కొన్ని రంగాలు వృద్ధిచెంది అవి లబ్ధిపొందుతాయని కూడా ఆశపెట్టారు. అయితే 14 ఏళ్ళు 9 విడతలుగా చర్చలు జరిగినా ఈ వాగ్దానాలు నీటిమూటలుగానే వుండిపోయాయి. కాగా ఈ "అభివృద్ధి" అన్న దానిని ఎరగా చూపించి సామ్రాజ్యవాదుల ఇతర నిబంధనలకు వెనుకబడిన దేశాలను ఒప్పించేవిధంగా అమెరికా, ఇయులు చర్చలను సాగదీస్తూ వచ్చాయి. ఇప్పుడు నైరోబీ సదస్సులో దోహా అభివృద్ధి అజెండాకు చావుమేళం వాయించాయి.

మరో మాటల్లో చెప్పాలంటే, బహుపక్ష వాణిజ్యం క్రింద ఆర్థిక ఆధిపత్యం బలహీనపడిన అమెరికా సామ్రాజ్యవాదం దానిని తిరిగి పొందేందుకు ఇతర పద్ధతులను అనుసరిస్తున్నది. ద్విపక్ష ఒప్పందాలతో వాణిజ్యకూటముల ఏర్పాటుకు తిరిగి వెళ్ళటం దీనిలో భాగమే. దీనికనుగుణంగా ప్రపంచ వాణిజ్యసంస్థను ముంచదలుచుకుంది. కనుకనే అమెరికా సామ్రాజ్యవాదం నైరోబీ సదస్సు నిర్ణయాన్ని "ప్రపంచ వాణిజ్యసంస్థ నూతన యుగ ప్రవేశానికి మార్గాన్ని సుగమం" చేసిందని పొగిడింది.

దోహా విడతల చర్చలు పెద్ద అజెండాతో ప్రారంభమయ్యాయి. వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, వాణిజ్య ప్రోత్సాహం, వెనుకబడిన దేశాల ప్రత్యేక అవసరాలు ఈ అజెండాలో వున్నాయి. వ్యవసాయరంగంలో మార్కెటు అందుబాటు, సుంకాలు, సబ్సిడీలు చర్చించాలని చెప్పారు. ఇంత పెద్ద అజెండాతో వస్తున్న ప్రతిపాదనలూ, వాటి పర్యవసానాలూ, అర్థం చేసుకోవటానికే వెనుకబడిన దేశాలకు కష్టమైంది. దానికి తోడు క్రొత్త ప్రతిపాదనతో సామ్రాజ్యవాదులు మరింత గందరగోళం కలిగించి దోహా చర్చలు పొడిగించారు. చివరికి 2008 బాలీ సదస్సులో వ్యవసాయరంగంపై ఒకే "ముసాయిదా విధానాలు" రూపొందింది. ఇది తన వాణిజ్య ప్రయోజనాలకు భంగం కలిగిస్తుందని ఒప్పందం కుదరకుండా మోకాలడ్డుపెట్టింది. ఈ ముసాయిదాలోని కొన్ని అంశాలపై ఆశలు పెట్టుకుని దాని అమలుకొరకు ఎదురుచూసిన వారందరూ నైరోబీ సదస్సు నిర్ణయంతో హతాసులయ్యారు. "అభివృద్ధి" అన్న ఎండమావుల వెంట 14 ఏళ్ళు వెనుకబడిన దేశాలను పరుగులు పెట్టించి, ఇప్పుడు ఆ 'అభివృద్ధి'ని కనిపించకుండా చేశారు సామ్రాజ్యవాదులు.

ఈ 14 సంవత్సరాలుగా వచ్చిన భారతదేశ ప్రభుత్వాలు భారత ప్రయోజనాలను సామ్రాజ్య వాదులకు లోబర్చాయి. బయటికి మాత్రం బీరాలు పలికాయి. అమెరికా సామ్రాజ్యవాదం నుండి ఏమాత్రం వత్తిడి వచ్చినా వాటి కాళ్ళు వణికాయి. చెప్పినచోట సంతకాలు చేశాయి. వీటికి తాజా ఉదాహరణ 2014 నవంబరులో ఒబామా – నరేంద్రమోడీ చేసుకున్న వాణిజ్య ప్రోత్సాహక ఒప్పందం. ఇది అమెరికా – భారత్‌ల వ్యూహాత్మక భాగస్వామ్యం ఒప్పందంలో భాగం. ఇది అమెరికా నుండి వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల దిగుమతులకున్న ఆంక్షలన్నింటినీ తొలగించింది. అంతేకాక భారత ఆర్థికవ్యవస్థ అన్ని రంగాలలోకి విదేశీ పెట్టుబడి ప్రవేశానికి గేట్లు ఎత్తివేయటానికి అంగీకరించింది. దీని తర్వాతే విదేశీ పెట్టుబడి ప్రవేశానికి నియమ నిబంధనల సడలింపు గురించి పదే పదే ప్రకటనలు, బీమా, బ్యాంకు రంగాల్లో విదేశీ పెట్టుబడి పరిమితిని ముక్కముక్కలుగా ఎత్తివేయటం, సేవారంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించాల్సిన అవసరాన్ని గురించి మాట్లాడటం టివిలూ, పత్రికల్లో విదేశీ పెట్టుబడులను అనుమతించటం, విద్యారంగంలో విదేశీ విశ్వ విద్యాలయాలకు ఆహ్వానం సాగుతూ వచ్చాయి.

ఇంతగా అమెరికా సామ్రాజ్యవాదం ముందు మోకరిల్లిన తర్వాత నైరోబీ సదస్సులో భారత ప్రభుత్వం ముందుంచిందంటున్న "డిమాండ్లకు" తగిన గౌరవం దక్కుతుందా? సామ్రాజ్యవాదులు వాటిని పట్టించు కోకుండా పక్కన పడేశారు.

భారత ప్రభుత్వం చేసిన "డిమాండ్ల"లో ఒకటి ప్రజాపంపిణీ వ్యవస్థకు సంబంధించింది. ప్రపంచ వాణిజ్యసంస్థ నిర్ణయం ప్రకారం ఆహార సబ్సిడీని తగ్గించుకోవాలి. దానికోసం భారత్ వంటి దేశాలు రైతుల నుండి ధాన్య సేకరణచేసి గోదాముల్లో ఉంచి, ప్రజలకు పంపిణీ చేయటాన్ని తగ్గించుకోవాలి. దీనికోసం కాలవ్యవధి కావాలని భారత్ అడిగింది. సామ్రాజ్యవాద దేశాలు దీనిని తిరస్కరించాయి. కాగా సామ్రాజ్యవాద దేశాలు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు యిస్తున్న సబ్సిడీలను తగ్గించవలసి వుండగా వాటికి అదనపు కాలవ్యవధినిస్తూ నిర్ణయం చేశాయి. కాస్త ఆలస్యంగానైనా భారత పాలకులు ప్రజా పంపిణీ వ్యవస్థను మూసివేయటమే జరుగుతుంది. ధాన్యసేకరణను కనీస అవసరాలకు తగ్గించుకోవాల్సి వస్తుంది. దీనికోసమే ప్రజాపంపిణీ వ్యవస్థలోని అక్రమాలు, అవినీతిని అరికట్టడం పేరిట అంతులేని చర్చలూ వివిధ విధానాలు ముందుకొస్తున్నాయి. ఇది భారత ప్రజలలో పేదవర్గాలను మరింత కృంగదీస్తుంది.

నైరోబీ సదస్సు దోహా అభివృద్ధి అజెండాను వదిలివేయటం, రెండు ప్రశ్నలను తిరిగి లేవనెత్తుతున్నది. ఒకదానికి రెండు దశాబ్దాల వయసుంది. వెనుకబడిన దేశాలు ప్రపంచవాణిజ్య సంస్థ నుండి బయటకు రావాలా లేదా? ప్రపంచ వాణిజ్య సంస్థతో వాటికున్న రెండు దశాబ్దాల అనుభవం తెలుపుతున్నదేమిటి? మూడవ ప్రపంచ దేశాలను అదిరించి, బెదిరించి, లాలించి సామ్రాజ్యవాద దోపిడీకి లోబర్చేందుకు సామ్రాజ్యవాదుల చేతిలోని మరొక పనిముట్టే ప్రపంచ వాణిజ్యసంస్థ. బహుపక్ష వాణిజ్యమైనా, ద్విపక్ష వాణిజ్యమైనా వెనుకబడిన దేశాల ప్రయోజనాలను కాపాడేందుకుద్దేశించినవి కావు; సామ్రాజ్యవాద దోపిడీని విస్తరించేవే. కనుక దాని నుండి బయటపడి స్వావలంబన దిశగా అవి ప్రయాణించాలి.

రెండవ ప్రశ్న : దోహా అభివృద్ధి అజెండాను వదిలివేసి ద్విపక్ష వాణిజ్యకూటముల ఏర్పాటుతో సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యం చల్లారుతుందా? సామ్రాజ్యవాదులనుసరిస్తున్న కొత్త వ్యూహంతో వాటి ప్రపంచమార్కెట్లు విస్తరిస్తుందనటం సరైనది; ఫలితం వాటి ఆర్థికవ్యవస్థలు వృద్ధి చెందుతాయి. దీనితో తిరిగి వాటా పెంచుకొనేందుకు వాటి మధ్య వైరుధ్యం మరింత తీవ్రమౌతుంది. దీనితో రాజకీయేతర పరిష్కారానికి సామ్రాజ్యవాదులు పూనుకోవాల్సిన స్థితికి ఈ వైరుధ్యం తీవ్రత వాటిని నెడుతుంది. దీనితో వెనుకబడిన దేశాలలో సైనికజోక్యాలూ దురాక్రమణలూ పెరుగుతాయి.

ఈ వైరుధ్యాన్ని పరిష్కరించగలిగేది సామ్రాజ్యవాద ప్రపంచ వ్యవస్థను కూలద్రోసి సోషలిస్టు సమాజ స్థాపనకు సకల శ్రామిక జనులతో కలిసి కార్మికవర్గం సాగించే పోరాటాలు మాత్రమే.

ooooo